క్లుప్తంగా

రామాలయానికి భూమిపూజ



రామాలయానికి భూమిపూజ చేస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని పుట్లంపల్లె శ్రీనగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యానగర్ బోర్డు వద్ద నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రామాలయానికి కడప మేయర్ కె.సురేష్ బాబు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాలయ నిర్మాణం ఎలాంటి అవరోధాలు లేకుండా సవ్యంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ నాయకులు వెంకటసుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఆర్‌వీ సుబ్బయ్య, శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

గిడుగు రుద్రరాజు అరెస్ట్ అన్యాయం

కడప వైఎస్ఆర్ సర్కిల్: అదానీ అక్రమ వ్యాపారాలపై గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళుతున్న గిడుగు రుద్ర రాజును పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయమని డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అదానీ గ్రూపులో పెట్టుబడులు ప్రోత్సహించడాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ



విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరిస్తున్న బాలాజీ, సంస్థ సభ్యులు

కడప కల్చరల్ : అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతోన్న పేదరిక విద్యార్థిని బి. వర్షితకు కడప నగరానికి చెందిన బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు సోమవారం ల్యాప్‌టాప్‌ను అందజేశారు. సంస్థ ప్రతినిధి డీఏ కార్తీక్‌రెడ్డి, ఎస్.పవన్ స్పందించి రూ. 36 వేలు విలువైన ల్యాప్‌టాప్‌ను ఆమెకు అందజేశారు. బాసట ఫుడ్ టీమ్ ఇన్‌ఛార్జి చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు కాలాష్టమి .. స్థానిక ఎంఎస్ కొట్టాలలోని కాలభైరవాపురంలోని శ్రీ ఇష్ట కామ్యార్థ కాలభైరవస్వామి ఆలయంలో బుధవారం కాలాష్టమి పూజలు నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మేరువ బాలాజీరావు తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

కడప ఎడ్యుకేషన్: ఏపీలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఉచిత నైపుణ్య శిక్షణ కార్యాక్రమాన్ని అందిస్తున్నట్లు సీపెట్ జాయింట్ డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ సిహెచ్ శేకర్ ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి కనీస విద్యార్హత కలిగి 18 నుంచి 28 ఏళ్లలోపు 30 మంది నిరుద్యోగ యువతకు ఉచితంగా యూనిఫాం, ట్రైనింగ్ కి ట్, సేఫ్టీ షూస్‌తో పాటు ఉచిత భోజనం, వసతి సదుయాలను అందిస్తూ ప్లాస్టిక్స్ ప్రాడక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆపరేటర్ అనే కోర్సులో 4 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.ఆసక్తిగల అభ్యర్థులు సిపెట్ ప్రతినిధి శ్రీను 6300147965 నెంబర్‌ను సంప్రదించాలని తెలపారు. దరఖాస్తు రిజిస్ట్రేషన్ పక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు.

కమలాపురంలో ఎన్నికలు ప్రశాంతం

వల్లూరు: కమలాపురం నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలో మొత్తం ఆరు మండలాలు ఉండగా పట్టభద్రుల ఓటర్లు మొత్తం 7181 మంది ఉన్నారు. ఇందుకు గానూ చింతకొమ్మదిన్నె , కమలాపురం మండలాల్లో రెండు పోలింగ్ కేంద్రాల చొప్పున, వల్లూరు, చెన్నూరు, పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లె మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున పోలింగ్ కేంద్రాలలో జరిగిన పోలింగ్‌లో 5631 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 78. 41 శాతం పోలింగ్ నమోదైంది.

■ నియోజకవర్గం మొత్తం 342 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. ఇందుకు గానూ మండలానికి ఒకటి చొప్పున ఆరు మండలాల్లో ఆరు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 327 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 95. 61 శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్ సరళి పరిశీలన

వల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ ఛైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిలు సందర్శించారు. పోలింగ్ సరళిని పరిశీలించారు. స్థానిక వైఎస్ఆర్‌సీపీ నేతలతో పోలింగ్‌ను గురించి ఆరా తీశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం



జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలోని పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో నిల్చొన్న ఉపాధ్యాయ ఓటర్లు

కడప కార్పొరేషన్: చెదురుముదురు సంఘటనలు మినహా పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 8 గంటల నుంచే ఓటింగ్ ప్రారంభం కాగా జిల్లా పరిషత్ ఆవరణంలోని డీపీఆర్‌సీ కేంద్రానికి ఉపాధ్యాయ ఓటర్లు పోటెత్తారు. మధ్యాహ్నం వరకూ క్యూలైన్లు కొనసాగాయి. ఓటర్ల స్లిప్పులు, గుర్తింపు కార్డులను మినహా సెల్‌ఫోన్లు, బ్యాగులను పోలీసులు పోలింగ్ కేంద్రంలోకి అనుమతించలేదు. పట్టభద్రుల పోలింగ్ స్టేషన్ల వద్ద ఉదయం మందకొడిగా ప్రారంభమైన ఓటింగ్ 10 గంటల నుంచి ఓటర్ల రాకతో పెద్ద పెద్ద క్యూ లైన్లు కనిపించాయి. పలు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటింగ్ సరళిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కె.సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డిప్యూటీ సీఎం సోదరుడు అహ్మద్‌బాషా పరిశీలించారు. సాయంత్రం 4 గంటల్లోపు క్యూ లైన్లలో ఉన్నవారిని ఓటు వేసేందుకు అనుమతించారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన ఎస్పీ, కమిషనర్

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలోని ఉపాధ్యాయ పోలింగ్ స్టేషన్లను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పరిశీలించారు. పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి తీసుకోవాల్సిన చర్యలపై డీఎస్పీ వెంకటశివారెడ్డికి సూచనలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులకు సంబంధించిన పోలింగ్ స్టేషన్లను మున్సిపల్ కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ పరిశీలించారు.

కవ్వింపు చర్యలకు దిగిన ఉస్మా నాయకులు

జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. అర్ధగంటలో పోలింగ్ ముగుస్తుందనగా ఉస్మా అసోసియేషన్ అధ్యక్షుడు టి. రమేష్ రెడ్డి, సీపీఐ నాయకులు కేసీ బాదుల్లా, నాగసుబ్బారెడ్డి, సుబ్రమణ్యం తదితరులు అధికార పార్టీ నాయకులు దొంగ ఓట్లు వేయిస్తున్నారని ఆరోపిస్తూ పదే పదే పోలీసులతో వాగ్వాదం చేస్తూ కవ్వింపు చర్యలకు దిగారు. ఈ క్రమంలో అటుగా వెళ్తున్న శ్రీ భాష్యం స్కూల్ కరస్పాండెంట్ నాగసుబ్బారెడ్డిని రమేష్‌రెడ్డి అడ్డుకొని అతని బ్యాగును, ఫైల్‌ను లాక్కునేందుకు ప్రయత్నించారు. అతను వెనుదిరుగుతుండగా వారంతా వెంటపడి దాడికి యత్నించడంతో నాగసుబ్బారెడ్డి కిందపడిపోయాడు. దాడికి యత్నించిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, లెక్కల జమాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు.



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, తహసీల్దార్ శివరామిరెడ్డి



పోలింగ్ కేంద్రంలో ఓటరు గుర్తింపు కార్డును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్



ఓటింగ్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడపలో పోలింగ్ ప్రశాంతం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడపలో పట్టభద్రులకు సంబంధించి 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఉపాధ్యాయులకు సంబంధించి మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం కడప నగర పరిధిలో పట్టభద్రుల ఓటర్లు 18,503 మంది ఉండగా, అందులో 12,264 (66.28 శాతం) మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి మొత్తం ఓటర్లు 2528 మంది ఉండగా, అందులో 2235 (88.40 శాతం) మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, తహసీల్దార్ శివరామిరెడ్డిలు పలు కేంద్రాలను పరిశీలించారు.



ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత సిరా గుర్తును చూపుతున్న అహ్మద్‌బాషా



జయనగర్ కాలనీ జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో నిల్చొన్న పట్టభద్రుల ఓటర్లు



ఓటు వేసిన అనంతరం సిరా గుర్తును చూపిస్తున్న దివ్యాంగురాలు

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరికి జ్యోతులు



జ్యోతులు ధరించి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



విశేష అలంకారంలో అమ్మవారు

కడప కల్చరల్: ఎర్రముక్కపల్లెలోని శ్రీ చౌడేశ్వరీ మాత ఆలయ వార్షికోత్సవం సందర్భంగా జ్యోతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 14 మంది భక్తులు జ్యోతులను ధరించి స్థానిక వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారి మూలమూర్తికి అభిషేకాలు, అలంకారం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. జ్యోతులు ధరించిన భక్తులు అమ్మవారి పేరిట జయజయధ్వానాలు చేస్తూ సాగగా, ఇతర భక్తులు వారి వెంట ఊరేగింపులో పాల్గొన్నారు.డప్పుల విన్యాసం, బ్యాండు మేళాల సందడి, జ్యోతిధారుల వీరంగాలతో ఆ ప్రాంతం సందడిగా మారింది. ఆలయ నిర్వాహకులు కల్యా సుధాకర్, ఉత్సవ కమిటీ సభ్యులు పల్లా నరసింహారావు, సుదర్శన్, మోతుకూరు సుబ్బరాయుడు, లక్ష్మయ్య, తొగటవీర క్షత్రియ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజుతోపాటు ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

పోరుమామిళ్ల: యోగాతో మానసిక ఒతిళ్లు దూరం అవుతాయి. ప్రతి వ్యక్తి ఆధ్యాత్మికంగా, భౌతికంగా జీవిత సమతుల్యత సాధించేందుకు యోగా మహోత్సవం దారి చూపుతుందని హార్ట్‌ఫుల్‌నెస్ ట్రైనర్ సత్యప్రవీణ్ పేర్కొన్నారు. పోరుమామిళ్లలో ఆ సంస్థ తరఫున మూడు రోజుల యోగా మహోత్సవం నిర్వహిస్తున్నారు. సోమవారం ట్రైనర్ సత్యప్రవీణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక విభాగం, శ్రీ రామచంద్ర మిషన్ సంయుక్తంగా దేశమంతటా యోగా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా పోరుమామిళ్లలో 12, 13, 14 తేదీల్లో ఉదయం 7 నుండి 8 గంటల వరకు ఒక బ్యాచ్‌కు, సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు ఒక బ్యాచ్‌కు యోగా మహోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు.యోగా మహోత్సవంలో ధ్యానం, ఆసనాలు, ప్రాణాయామం, ముద్రలు చేయడం ద్వారా ఒత్తిడి నుంచి దూరమయి, రోగాలు లేని ఆనందమయ జీవితాన్ని కొనసాగించగలరని పేర్కొన్నారు.

బారులు తీరిన పట్టభద్రులు

చింతకొమ్మదిన్నె : మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో 1761 పట్టభద్రుల ఓట్లు ఉండగా 1380 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే 342 ఉపాధ్యాయ ఓట్లు ఉండగా 327 ఓట్లు పోల్ అయ్యాయని మండల తహశీల్దార్ గంగయ్య అన్నారు. కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి పోలింగ్ కేంద్రానికి వచ్చి పోలింగ్ సరళిని పరిశీలించారు.

చెన్నూరు : చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఆయన తనయుడు, సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి ఓటింగ్ సరళిని పరిశీలించారు పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్ భవన్‌ను అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ అదనపు డివిజనల్ కార్యదర్శి డి.నరసింహారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వే ఇన్‌స్టిట్యూట్‌భవన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తామని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ అదనపు డివిజనల్ కార్యదర్శి డి.నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం కడప రైల్వేస్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగు సంవత్సరాలుగా కడప రైల్వే ఇన్‌స్టిట్యూట్ భవన్ నిర్మాణానికి నోచుకోలేదన్నారు. ఈనెల 15వ తేదిన ఎన్నికలు జరగనున్నాయని, ఈ ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ ఎన్నికల్లో తమ ప్యానల్ కార్యదర్శిగా నరసింహారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఈశ్వరయ్య, కోశాధికారిగా ఉమర్‌బాష, కమిటీ సభ్యులుగా మల్లేష్, రాజశేఖర్, దస్తగిరి సాహెబ్, మహమ్మద్ షరీఫ్, లక్ష్మితేజ, జబీవుల్లాలు పోటీ చేస్తున్నారన్నారు. తమ ప్యానల్‌ను గెలిపిస్తే రైల్వే కార్మికుల కుటుంబాలకు చెందిన శుభకార్యాలకు ఉపయోగపడేలా ప్రత్యేక గదులను నిర్మిస్తామన్నారు.రైల్వే ఇన్సిట్యూట్ భవనాన్ని పూర్తిగా పీఓపీ సీలింగ్ చేయించి ఎయిర్ కండీషన్‌గా మారుస్తామన్నారు. అధునాతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ భవన్ కోశాధికారి ఉమర్‌బాషా, కమిటీ మెంబర్ రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి



వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినిలతో అతిథులు, నిర్వాహకులు

కడప కల్చరల్ : జిల్లాకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు రెడ్డి సేవా సమితి చేస్తున్న కృషి ప్రశంసనీయమని చిన్మయ మిషన్ కడపశాఖ అధ్యక్షులు తురియానంద సరస్వతిస్వామి పేర్కొన్నారు. సోమవారం స్థానిక రాజీవ్‌మార్గ్‌లోని రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో పుట్లంరెడ్డి శకుంతలమ్మ మహిళా వసతి గృహంలో 17వ హాస్టల్‌డేను ఘనంగా నిర్వహించారు. సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ కుప్పిరెడ్డి నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హాస్టల్ నిర్వహణకు కృషి చేస్తున్న కమిటీ సభ్యులందరూ అభినందనీయులన్నారు. కడప డివిజన్ వాణిజ్య పన్నులశాఖ డిప్యూటీ కమిషనర్ బెడదల విజయలక్ష్మి , రెడ్డి సేవా సమితి అధ్యక్షులు నాగిరెడ్డి, వైవీయూ అసోసియేట్ ప్రొఫెసర్ కొవ్వూరు రామసుబ్బారెడ్డి ప్రసంగించారు. రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి వార్షిక నివేదిక సమర్పించారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సంస్థ కోశాధికారి గుడ్ల ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో అతిథులు బహుమతులు, జ్ఞాపిక, సర్టిఫికెట్లు అందజేశారు. సంస్థ కార్యవర్గ సభ్యులు పద్మప్రియ చంద్రారెడ్డి, వెంకట రెడ్డి, వి.రాఘవరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

వాగ్దేవి వరపుత్రిక మొల్లమాంబ



మొల్లమాంబ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న గానుగపెంట హనుమంతరావు తదితరులు

కడప కల్చరల్ : మహా కవయిత్రి మొల్లమాంబ సాక్షాత్తు వాగ్దేవి వరపుత్రిక అని మొల్లమాంబ సాహిత్యపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు కొనియాడారు. గోపవరం మొల్లమాంబ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఆయన కడప నగరం కోటిరెడ్డిసర్కిల్‌లోని మొల్లమ్మ విగ్రహానికి పూలమాల సమర్పించి పూజలు చేశారు. కార్యక్రమంలో పీఠం ఉపాధ్యక్షులు పెండ్లిమర్రి మల్లయ్య, మహిళా కార్యదర్శులు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

'మొల్ల ప్రభ' నివాళి

స్థానిక మొల్ల ప్రభ సేవా సమితి ప్రతినిధులు మొల్లమాంబ జయంతిని పురస్కరించుకుని ఆమె విగ్రహానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఇంటర్మీడియేట్ బోర్డు రిటైర్డ్ ఆర్ఐఓ, కవిత విద్య సాంస్కృతిక సేవా సమితి వ్యవస్థాపకులు అలపర్తి పిచ్చయ్యచౌదరి , బీసీ సంక్షేమ సంఘం నాయకులు నాగయ్య, జగన్మాత మారెమ్మ తల్లి ఆలయ ధర్మకర్త సట్టి భారవి, బీసీ సంఘం కన్వీనర్ ఖాదర్‌బాష, గోవిందు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాత రిమ్స్‌లోని ఆదరణ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు.

ఓటర్లంతా వైఎస్ జగన్ వైపే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, చిత్రంలో ఆర్టీసీ ఛైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి

కమలాపురం: రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఓటర్ల మనోభావాలు సీఎం వైస్ జగన్‌మోహన్ రెడ్డి వైపే ఉన్నాయని, వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థుల విజయం నల్లేరు పై నడకేనని ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం కమలాపురం పట్టణంలో జరిగిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎన్నికల పోలింగ్ సరళిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటు అభివృద్ధి, అటు సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తున్నారన్నారు. వైస్ జగన్ పాలనకు ఆకర్షితులైన ఓటర్లు తప్పని సరిగా వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులకే ఓట్లు వేస్తున్నారని, వారి విజయం నల్లేరుపై నడేకనని అన్నారు. విద్య పై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంచి ఫోకస్ పెట్టారని, నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేట్‌లకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. భవిష్యత్తు తరాల వారికి విద్యనే ఆస్తులుగా ఇవ్వాలన్నదే సీఎం వైఎస్ జగన్ సంకల్పం అన్నారు. అందుకే ఏ రాష్ట్రంలో లేక పోయిన ఏపీలో ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేసి ప్రపంచంలోని అన్ని దేశాలతో ఏపీ విద్యార్థులు పోటీ పడేలా చర్యలు తీసుకున్నారని స్పష్టం చేశారు.

ఏటా రూ.35వేల కోట్లు ఖర్చు: ఎమ్మెల్యే

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి ఏటా విద్య పై రూ.35వేల కోట్లు వెచ్చిస్తున్నారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. విద్య, వైద్యం ,వ్యవసాయంపై సీఎం ఫోకస్ పెట్టారన్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదివిన వారే ప్రస్తుత ఎన్నికల్లో అధిక శాతం మంది ఓటర్లు ఉన్నారన్నారు. వారంతా వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులకే ఓట్లు వేస్తారన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు 85 శాతం ఓట్లతో గెలుపొందు తారన్నారు. నాలుగేళ్లుగా సీఎం వైఎస్ జగన్ పరిపాలన తీరును ప్రజలు పరిశీలిస్తున్నారని, ప్రతి కుటుంబానికి ఈ ప్రభుత్వం ద్వారా ప్రయోజనం చేకూరుతోందన్నారు. ప్రజలందరికి జగన్ పరిపాలనపై పూర్తి నమ్మకం వచ్చిందని, ఎన్ని కష్టాలు వచ్చినా జగనన్న ఇచ్చిన మాట తప్పడని ఓటర్లకు తెలుసన్నారు. దేశంలోనే నెంబర్ వన్ సీఎంగా వైఎస్ జగన్ నిలుస్తారని, అన్ని సర్వేలు అదే చెబుతున్నాయన్నారు.ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

15న విద్యుత్ అదాలత్

మైదుకూరు : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న బుధవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ జీవీ రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు విద్యుత్ డివిజన్ కార్యాలయ ఆవరణలో 15న ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే ఈ అదాలత్‌లో మైదుకూరు, బద్వేలు నియోకవర్గాలలోని అన్ని మండలాల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. అదాలత్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక అధ్యక్షుడు కె.రామమోహన్ రావు, సాంకేతిక సభ్యుడు ఎస్ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యురాలు జి.ఈశ్వమ్మ పాల్గొంటారని వివరించారు.

నేడు ఆంజనేయస్వామి వార్షికోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక హనుమాన్ నగర్‌లోని కోతి సమాధి వద్ద అంజనేయస్వామి మహోత్సవాలు, 35వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ, సాయంత్రం తొట్టి మెరవణి, బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వినియోగం ఉంటాయని వారు పేర్కొన్నారు.

'ఆల్బెండజోల్'తో నులిపురుగుల నివారణ

ప్రొద్దుటూరు క్రైం : ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చని డాక్టర్ హనీఫ్‌బాబా తెలిపారు. మండలంలోని కామనూరు పీహెచ్‌సీలో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు 400 మిల్లీగ్రాముల మాత్రలను అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ మాత్రలు ఎంతో సురక్షితమైనవని, నులిపురుగుల నుంచి రక్షణ కల్పిస్తాయన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 104 డాక్టర్ సుబ్రమణ్యం, సీహెచ్‌ఓ కృష్ణమ్మ, హెచ్‌ఈ శోభారాణి, సూపర్‌వైజర్ వరప్రసాద్, చంద్రశేఖర్, సీహెచ్‌ఓలు నాగేంద్ర, దివ్యజ్యోతి, నర సింహ, గంగాధర్, నిర్మల, ఆరోగ్య కార్యకర్తలు నాన్సి, సుప్రజ, అరుణ, దీప్తి, ఉమ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

బి.కోడూరు :జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని మంగళవారం అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారులు డాక్టర్ ఎస్.వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఎ.ఉదయ్‌కిరణ్‌లు తెలిపారు. విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరుగుతుందన్నారు.